క్లుప్తంగా

రికార్డులు పారదర్శకంగా నిర్వహించాలి



తాతపూడి సచివాలయం ఉద్యోగులతో ప్రత్యేకాధికారి శాంతి

కపిలేశ్వరపురం: సచివాలయాల్లో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి ఆదేశించారు. తాతపూడి సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డితో కలిసి సచివాలయంలో ఉద్యోగుల విధులను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలకు సంబంధించి పలు సూచనలు చేశారు.

డ్రగ్స్ రహిత సమాజానికి పాటు పడాలి



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సాయి సత్యనారాయణ

కాజులూరు: డ్రగ్స్ (మత్తు పదార్థాలు) రహిత సమాజం కోసం యువత పాటు పడాలని తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ అన్నారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎస్ సత్య శ్రీనివాస్ అధ్యక్షతన డ్రగ్స్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ బారిన పడితే వారితో పాటు వారి కుటుంబం, తద్వారా సమాజం అధోగతి పాలవుతాయని అన్నారు. విద్యావంతులైన యువత సన్మార్గంలో పయనించడం ద్వారా అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారని చెప్పారు. గొల్లపాలెం ఏఎస్సై డేవిడ్ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవటం వలన ఆరోగ్యానికి, ఆర్థికంగా జరిగే నష్టాలు, ప్రమాదాలు, కేసుల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సింగంపల్లి లోవరాజు, ఎంసీహెచ్ శ్రీనుబాబు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మూర్తి, భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా అర్జివేణి

కాజులూరు: బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా ఎ.అర్జివేణి నియమితులయ్యారు. పార్టీ యువ మోర్చా అధ్యక్షుడు నిమ్మల రాజేష్ అధ్యక్షతన అంద్రంగిలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో అర్జివేణికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీర వెంకట సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఆమెను పార్టీ జిల్లా కార్యదర్శి తలాటం అమ్మాజీ, మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ, కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

కొత్త పెన్షన్లు, ఇళ్ల పట్టాల పంపిణీ



అన్నాయిపేటలో ఇళ్ల పట్టాలు, నూతన పెన్షన్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటలో కొత్తగా మంజూరైన పెన్షన్లు, గతంలో ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాలను సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యాన గురువారం పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్ (బాబీ), ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, మాజీ సర్పంచ్ పాలిక అప్పారావు తదితరుల చేతుల మీదుగా వీటిని అందజేశారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కె.గంగవరం: మండలంలోని పామర్రులో కొలువైయున్న శ్రీ ఉమా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. పామర్రుతో పాటు పరిసర గ్రామాల మహిళలు పాల్గొని ఈ కార్యక్రమంలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. వ్రతంలో పాల్గొన్న మహిళలందరికీ శ్రీ వరలక్ష్మీ దేవి వెండి రూపు ఉచితంగా ఇస్తామని చెప్పారు.

లేఖర్ల నిరసన

రామచంద్రపురం: పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖర్లు రెండో రోజైన గురువారం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో లేఖర్లు వెదుళ్ల విజయభాస్కర్, తాడి వీరగోపాలరెడ్డి, తాడి జైభారత్‌రెడ్డి, సత్తి గంగిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురువారం భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి పూజలు నిర్వహించారు. పీఠంలో విజయదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు జరిపారు. విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళార్చన, భవాని శంకర అష్టలింగేశ్వర స్వామికి రుద్రాభిషేక పూజలు జరిపారు. అమ్మవార్ల పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమాలను సేవా సమితి ప్రతినిధులు జి.భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పి.సత్య కనకదుర్గ, బి.రమ, పీఆర్వో బాబి పర్యవేక్షించారు.

శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో..

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద శ్రీసీతారామ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరునికి గోగులాంబ అమ్మవారి నుంచి రాఖీలు

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధ శైవ క్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరునికి వెలంపాలెంలో వేంచేసియున్న స్వామి వారి సోదరి గోగులాంబ అమ్మవారు రాఖీలు పంపించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా రక్షా బంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆ గ్రామ సర్పంచ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య ఈ రాఖీలు తీసుకుని వచ్చి స్వామివారికి అందజేశారు. వీటిని రుత్విక్కులచే భీమేశ్వరస్వామి వారికి అలంకరింపజేశారు. కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఈఓ పితాని తారకేశ్వరరావు, శ్రీ రాజరాజేశ్వరి పీఠాధిపతి, మాస శివరాత్రి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్ల సాంబశివరావు గురూజీ, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.



గోగులాంబ అమ్మవారి తరఫున భీమేశ్వరస్వామికి రాఖీలు సమర్పిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

గ్రామాల్లో రాఖీ పండగ సందడి

కపిలేశ్వరపురం: గ్రామాల్లో రాఖీ పండగ సందడి నెలకొంది. గురువారం సోదరులకు సోదరీమణులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల మధ్య బంధం కలకాలం సజీవంగా ఉండాలని కాంక్షిస్తూ సరదాగా గడిపారు. సోదరులకు విందు వడ్డిస్తూ సోదరీమణులు చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సమేతంగా దేవతా మూర్తుల ఆలయాలను సందర్శించారు. చిన్నారులు, యువతీ యువకులు రాఖీలు కొనుగోలు, కట్టేందుకు చేసిన ప్రయాణాలు, బహుమతులు సమర్పణలతో గ్రామాలు సందడిగా మారాయి.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు



మండపేటలో అమ్మవారికి అర్చకుడి అభిషేకం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుంది. గొల్లపాలెం సబ్ స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ ఈ విషయం తెలిపారు. సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి తదితర గ్రామాల్లో గృహ, రొయ్యల చెరువులు, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

సాయిబాబు సేవలు ఆదర్శవంతం



సాయిబాబును సత్కరిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సలాది సాయిబాబు గురువారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. కాకినాడలోని జిల్లా ఎస్పీ కార్యాలయ అనుబంధ డీసీఆర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన స్వస్థలం కోనసీమ జిల్లా కూళ్ల మల్లవరం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిబాబును కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, 33 ఏళ్లుగా సాయిబాబు పోలీస్ శాఖకు విశేష సేవలందించారన్నారు. ఆదర్శవంతమైన సేవలు అందించిన ఆయనను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఈశ్వరుడు సహా సిబ్బంది పాల్గొన్నారు.

రాగి తీగ చోరీపై కేసు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కేపీఆర్ వెనక ఉన్న పామాయిల్ తోటలో జరిగిన రాగి తీగ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు కేపీఆర్ వెనక ఉన్న తన పామాయిల్ తోటలో ఈ నెల 27న 194 మీటర్ల రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ఎలకొట్టుడు

- తొలకరి పంటకు మూషికాల బెడద
- అన్నదాతకు అధిక వ్యయం
- దిగుబడిపై ప్రభావం పడే అవకాశం
- ఆందోళన చెందుతున్న రైతులు

కాజులూరు: 'గోరుచుట్టుపై రోకలిపోటు' అన్న చందగా ఉంది నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి. ఈ ఏడాది ఖరీఫ్ మొదలైనప్పటి నుంచీ వర్షాలు సరిగ్గా కురవక పోవటంతో వరి నారుమడుల్లో మొలక శాతం తగ్గిపోయింది. దీంతో నారు కొరత ఏర్పడింది. దీనిని అధిగమించేందుకు రైతులు నానా అవస్థలూ పడ్డారు. పొలంలో మొక్కల సంఖ్య తగ్గటంతో ఇతర ప్రాంతాల నుంచి నారు తీసుకువచ్చి చెదురుమదురుగా నాట్లు వేసుకున్నారు. ఈ వరి చేలు ఇప్పుడిప్పుడే దుబ్బు కడుతున్నాయి. సరిగ్గా ఇదే తరుణంలో పంటపై ఎలుకలు దాడి మొదలైంది. ఎలుకలు వరి మొక్కలను కొరికివేస్తుండటంతో వాటిని అదుపు చేయలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. రసాయనిక మందులు వాడినా ఎలుకల నిర్మూలన సాధ్యం కాకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు వారు అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ముందుగా ఊడ్చిన పొల్లాలతో పాటు వెదజల్లిన పొలాల్లో కూడా ఎలుకలు ఎక్కువగా వరి మూనల్ని నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

ఎలుకల నివారణకు వరి నూకల్లో తగిన మోతాదులో రసాయనిక మందు కలిపి, పొట్లాలు కట్టి, పొలాల్లోని గట్లపై ఉండే ఎలుకల కన్నాల వద్ద ఉంచే వారు. అయితే, ఎలుకల ఉధృతి అధికంగా ఉండటంతో ప్రస్తుతం ఈ విధానం ఫలితం ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎలుకల బుట్టలు ఉపయోగించడం, పొగ పెట్టడం వంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. బుట్టలు పెట్టే విధానంలో ఎరగా ఉంచిన ధాన్యం గింజలు తినడానికి వచ్చిన ఎలుక ప్రత్యేకంగా అమర్చిన వెదురు కర్రల మధ్య చిక్కుకుని మరణిస్తుంది. పొగ పెట్టే పద్ధతిలో ఎలుకలు తిరుగాడే ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొంత మేర తవ్వి, కుండలో గడ్డి ఉంచి, నిప్పు పెట్టి, పొగ వచ్చేలా చేసి, కన్నం వద్ద ఉంచుతారు. ఆ పొగకు కన్నంలో ఉన్న ఎలుక ఊపిరాడక చనిపోతుంది. ఎలుక ఉన్న ప్రాంతంలో లోతుగా కన్నం తవ్వి చేత్తో పట్టుకుని చంపేస్తారు. ఈ విధానాల ద్వారా ఒక్కో ఎలుకకు రూ.60 చొప్పున తీసుకుంటారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎలుకలు పట్టేవారికి డిమాండ్ పెరగడంతో ఒక్కోసారి ఈ రేటు పెంచుతున్నారని రైతులు చెబుతున్నారు. ఎలుకలు పట్టుకునేందుకు మెట్ట ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొందరు.. రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రైతులను కలుసుకుని ఒప్పందం కుదుర్చుకుంటారు. ఎకరానికి రూ.3 వేల చొప్పున బేరమాడుకుని ఆ పంట కాలం పూర్తయ్యే వరకూ ఎలుకలను చంపుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎలుకల నిర్మూలన పూర్తిగా సాధ్యం కావడం లేదు. దీంతో ఇవి దిగుబడిపై ప్రభావం చూపుతాయని రైతులు కలవరపడుతున్నారు.



కాజులురులో పొలం గట్టుపై పొగ పెట్టి ఎలుకలను చంపుతున్న దృశ్యం

పంట నాశనమవుతుంది

ఎలుకల దాడికి గురైతే వరి పంట సర్వనాశనమవుతుంది. మార్కెట్లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినటం లేదు. ఎలుకలు వరి దుబ్బులను మొదలంటా కొరికి పారేస్తూండటంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 10 బస్తాలు పైగా దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది.

– గోవాల కామరాజు, రైతు, గొల్లపాలెం



బుడగ జంగాల సంక్షేమానికి కృషి

మండపేట: బేడా బుడగ జంగాలల అభ్యున్నతికి కృషి చేస్తామని ఉమ్మడి జిల్లా ఎస్సీ ఎస్టీ సర్పంచుల సమాఖ్య కో కన్వీనర్, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. బేడా బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ హాలును గురువారం సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి ముడిపడి ఉందని, పేదల విద్యకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను బేడ బుడగ జంగాల ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పిల్లల ఉన్నతికి బాటలు వేయాలన్నారు. కల ధృవీకరణ పత్రాలు ఇప్పించాలని సంఘ నాయకులు కోరగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని వారు తెలిపారు. సంఘ నాయకులు పేర్ల శ్రీను, పేర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పేర్ల మహేష్, నామాల బంగారి, కిన్నెర దోసాలు, చెన్నూరి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ నాగబాబు

'గిడుగు' పురస్కారం ప్రదానం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణకు తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు పురస్కారం లభించింది. వర్సిటీలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంతో పాటు తెలుగు భాష, సంస్కృతీ సాహిత్యాల అభివృద్ధికి కృషి చేసిన ఆయన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ విజయవాడలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దీనికి సంబంధించిన జ్ఞాపికను డాక్టర్ తరపట్లకు అందజేస్తూ 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు అభినందనలు తెలిపారు.

బీఎస్సీ పుస్తకావిష్కరణ

నన్నయ వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.వెంకట్రావు రచించిన బీఎస్సీ పాఠ్య పుస్తకాన్ని వీసీ ఆచార్య పద్మరాజు ఆవిష్కరించారు. ఫస్ట్ సెమిస్టర్‌కు సంబంధించిన 'ఎసెన్షియల్స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ మేథమెటికల్, ఫిజిక్స్ అండ్ కెమికల్ సైన్సెస్' పాఠ్య పుస్తకంగా ఇది ఉపయోగపడుతుంది. డాక్టర్ వెంకట్రావుతో పాటు ఆర్ట్స్ కాలేజీ, అనుబంధ కళాశాలల అధ్యాపకులు ఈ పుస్తక రచనలో పాలు పంచుకున్నారు.

ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు



శాకంబరీదేవిగా సంతోషిమాత

అనపర్తి: స్థానిక సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు జి.ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శాకంబరిగా అలంకరించారు. భక్తులచే అమ్మవారికి సహస్ర పుష్పార్చన, సామూహిక లక్ష కుంకుమార్చన జరిపారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



కోట వద్ద బెర్ములు లేక ప్రమాదకరంగా ఉన్న రహదారి

ఆహ్లాదకరంగా ఉందని ఇక్కడ గోదావరిని చూస్తూ వాహనాలు నడిపితే ఆసుపత్రి పాలవ్వల్సిందే. పర్యాటకంగా ఆహ్లాదకరంగా ఉండే జొన్నాడ – యానాం ఏటిగట్టు రహదారికి బెర్ములు సక్రమంగా లేకపోవడం ప్రమాదకరంగా మారింది. గత పుష్కరాల్లో రూ.30 కోట్లతో ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. ఈ రోడ్డు బాగుండటంతో జొన్నడ – యానాం మధ్య వందలాది మంది ప్రయాణిస్తున్నారు. అయితే బెర్ములు సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కె.గంగవరం మండలంలో ఈ రోడ్డు మరింత ప్రమాదకంరగా ఉంది. కోటిపల్లి – కోట, బ్రహ్మపురి – గోవలంక మధ్య ఏటిగట్టు కోతకు గురై రోడ్డుకు బెర్ములు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారికి బెర్ములు పటిష్టంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ఏటిగట్టు పరీవాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

– కె.గంగవరం



కలవచర్లలో అందిస్తున్న ఆధార్ సేవలను పర్యవేక్షిస్తున్న మండల అధికారులు

ముంగిట్లో ఆధార్

- గ్రామాల్లో ప్రతి నెలా క్యాంపులు
- అందరికీ అందుబాటులో సేవలు
- మూడు నియోజకవర్గాల్లో 1.89 లక్షల నవీకరణలు పెండింగ్

ఆలమూరు: వ్యక్తిగత లావాదేవీల నుంచి ప్రభుత్వ పథకాల వరకూ ఆధార్ కార్డు ప్రస్తుతం ప్రతి ఒక్కరికి అత్యంత అవసరంగా మారిపోయింది. 2010లో ప్రవేశపెట్టిన ఈ కార్డును అప్పట్లో ఎటువంటి ఆధారాలూ లేకుండానే మంజూరు చేశారు. దీనివల్ల అక్రమాలు జరిగి, నకిలీ కార్డులు ఉన్నట్టు గుర్తించడంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఆధార్ అప్‌డేషన్ (నవీకరణ) తప్పనిసరి చేసింది. లేకుంటే సెప్టెంబర్ నుంచి ఆధార్ కార్డు నిలిపివేస్తామని హెచ్చరించింది. దీంతో ఆధార్ నవీకరణకు జనం క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు గతంలో గుర్తించిన మీసేవ కేంద్రాలకు అదనంగా నామమాత్రపు రుసుంతో మండలానికి మూడు చొప్పున ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆధార్ అప్‌డేషన్ చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ సేవలను మరింత విస్తృతం చేయాలన్న ఉద్దేశంతో ఆ బాధ్యతను జాయింట్ కలెక్టర్లకు అప్పగించింది. క్షేత్రస్థాయిలో ప్రతి నెలా ఒక రోజు ఆధార్ సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సులభతరంగా..

గ్రామ స్థాయిలో ప్రతి నెలా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తూండటంతో ఆధార్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. ఎటువంటి జాప్యమూ లేకుండా నిర్దేశిత సమయంలో ఆధార్ సేవలు అందించడంపై గ్రామీణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 178 గ్రామాలున్నాయి. వీటిలోని 237 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకూ 1.89 లక్షల మంది ఆధార్ కార్డుల అప్‌డేషన్ పెండింగ్‌లో ఉంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతి నెలా నాలుగు రోజుల పాటు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో వలంటీర్లు విస్తృతంగా అవగాహన కల్పించడంతో ఆధార్ సేవలను వినియోగించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

ఆధార్ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు

ఆధార్‌లో మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ లింకింగ్, బయోమెట్రిక్ అప్‌డేట్, పేరు మార్పు, పుట్టిన తేదీ మార్పు, జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ మార్పు, చిరునామా మార్పు, కొత్త ఆధార్ నమోదు, బాలల ఆధార్ నమోదు, చిన్నారుల, పెద్దల బయోమెట్రిక్ అప్‌డేట్.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రజల సౌకర్యార్థం గ్రామ సచివాలయాల్లోనే అందిస్తున్న ఆధార్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. పదేళ్లు దాటిన వారందరూ కచ్చితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి.

– ఐపీ శెట్టి, తహసీల్దార్, ఆలమూరు



అప్‌డేషన్ ఎందుకంటే..

- పునర్విభజన నేపథ్యంలో ఏర్పడిన కొత్త జిల్లాల్లో కొత్త చిరునామాలతో ప్రతి పౌరుడూ మార్పులు చేసుకోవాలి.
- చిరునామాలో మార్పులు జరిగితే ఆధార్ కార్డులో సత్వరమే అప్‌డేట్ చేయించుకోవాలి.
- మహిళలకు వివాహానికి ముందున్న ఇంటి పేరును మార్చుకోవడానికి తప్పనిసరిగా అప్‌డేషన్ చేయించుకోవాలి.
- కొత్తగా పెళ్లయిన వారు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పనిసరిగా మ్యారేజీ సర్టిఫికెట్ తీసుకుని, ఆధార్ కార్డును పునరుద్ధరించుకోవాలి.
- అప్‌డేట్ చేయించుకోకుంటే ఆధార్ కార్డు బ్లాక్ అయిపోతుంది.
- దీనివల్ల ప్రభుత్వం నుంచి లభించే సేవలన్నీ నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ వంటి సర్వీసులు ఆగిపోతాయి.